

పోచారం.. 'వన విజ్ఞానం'

భవిష్యత్తు తరాల విద్యార్థులకు ఉపయోగపడేలా పోచారం వన విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. వివరాలు 8లో ▸



నకిలీ విత్తనాలపై నజర్

విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో రైతులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. వివరాలు 8లో ▸



భూసార పరీక్ష.. పంటకు రక్ష

సాగుకు ముందు భూసార పరీక్షలు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

అందుబాటులో కేఎస్‌ఎం 1638 వరి విత్తనం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి వద్ద గల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో కేఎస్ఎం 1638 సన్నరకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, శాస్త్రవేత్తలు రవి కుమార్, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. 20 కిలోల బస్తా రూ. 1,060 లభిస్తుందన్నారు. ఎస్ఎం 1638 సన్నరకం వరి విత్తనాల పంటకాలం 135 రోజులు కాగా, అగ్గితెగులు, ఉల్లికోడును సమర్థవంతంగా తట్టుకుంటుందని చెప్పారు. ఎకరాకు 28 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. వానాకాలం, యాసంగి రెండు పంటలకు అనుకూలమని వివరించారు. జూన్ 2 నుంచి రైతులకు విత్తనాలను విక్రయించనున్నట్లు పేర్కొన్నారు.

'భూభారతి'పై అవగాహన అవసరం



అవగాహన సదస్సులో పాల్గొన్న గ్రామస్తులు

పాపన్నపేట(మెదక్): గ్రామీణ రైతాంగం భూభారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని హైకోర్టు న్యాయవాది శ్రీకాంత్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని పొడిచన్‌పల్లి తండాలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 1168, కొత్తపల్లి పరిధిలోని సర్వే నంబర్ 342లో కొంతమంది రైతులు పాత పాస్ పుస్తకాలు కలిగి ఉండి, భూములు సాగు చేసుకుంటున్నప్పటికీ రైతు భరోసా, బీమా వంటి పథకాలు అందడం లేదని చెప్పారు. ఈ సమస్యలను ప్రో బోనోగా స్వీకరించి న్యాయపరంగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా నిరుపేదలకు న్యాయం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు నల్లపు మణిదీప్, చంద్రకుమార్, గణేష్, పలువురు రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రామ పాలన అధికారి పరీక్ష



పరీక్ష కేంద్రం వద్ద అధికారులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రామ పాలన అధికారి పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఆర్‌ఓ భుజంగరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షకు 104 మంది దరఖాస్తు చేసుకోగా, 79 మంది హాజరైనట్లు చెప్పారు. మరో 25 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్డీఓ రమాదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, పోలీస్ అధికారులు ఉన్నారు.

'వారిపై చర్యలు తీసుకోండి'

కొమురవెల్లి(సిద్దిపేట): దళితబంధు పేరుతో గత ప్రభుత్వంలో డబ్బులు వసూలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం లెనిన్‌నగర్‌లో దళితబంధు పథకం కోసం బీఆర్ఎస్ నాయకుడికి డబ్బులు ఇచ్చి మోసపోయిన దాసరి హరిబాబును పరామర్శించారు.

కొనుగోళ్లలో కొర్రీలు రైతన్న వెతలు

- లారీ లోడ్ ఉంటేనే కొంటామని పరతు
- మ్యాచర్ రాలేదని మెలిక
- లబోదిబోమంటున్న అన్నదాత



ముస్లాపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు

అల్లాదుర్గం(మెదక్): అన్నదాతలు దగా పడుతున్నారు. యాసంగి ధాన్యం విక్రయించేందుకు నానాపాట్లు పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట విక్రయంలో కొర్రీలు పెడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. లారీ లోడ్ ధాన్యం లేదని.. రైస్‌మిల్లు టార్గెట్ అయిపోయిందని.. మ్యాచర్ రాలేదని.. ఇలా రకరకాల సాకులు చెబుతుండటంతో లబోదిబోమంటున్నారు. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ కొనుగోలు కేంద్రంలో పీఏసీఎస్ అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వర్షాలతో మ్యాచర్ రాక అవస్థలు పడుతుంటే, మరోవైపు మ్యాచర్ వచ్చినా, లారీ ధాన్యం లేదంటూ కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారి మ్యాచర్ చెక్ చేసి వచ్చిందని చెప్పి 10 రోజులు గడిచినా.. ధాన్యం కొనుగోలు చేయడం లేదని వాపోతున్నారు. కొనుగోలు చేయమని అధికారులు, పీఏసీఎస్ చైర్మన్‌ను వేడుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై పీఏసీఎస్ సిబ్బందిని వివరణ కోరగా.. కేంద్రంలో 100 బస్తాలు మాత్రమే ఉన్నాయని, లారీ లోడ్ లేదని, అందుకే కొనుగోలు చేయడం లేదని తెలిపారు. స్థానిక రైస్‌మిల్లు వారు టార్గెట్ అయిపోయిందని ధాన్యం బస్తాలు దించుకోవడం లేదన్నారు. సిద్దిపేట మిల్లుకు బస్తాలు తీసుకెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

హైవే నిర్మాణం.. చెట్లు మాయం



రోడ్డు విస్తరణతో చెట్లు లేక బోసిపోయిన రోడ్డు

రామాయంపేట(మెదక్): మెదక్– రామాయంపేట మధ్య 20 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా వేల సంఖ్యలో ఏళ్ల క్రితం నాటిన చెట్లు ఉండేవి. ఈదారిలో ప్రయాణం అత్యంత ఆహ్లాదకరంగా ఉండేది. ఈక్రమంలో మెదక్ నుంచి సిద్దిపేట వరకు జాతీయ రహదారి (765 డీజీ) నిర్మాణానికి మూడేళ్ల క్రితం కేంద్రం రూ. 882 కోట్లు మంజూరు చేసింది. పనులు సైతం ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే రోడ్డు పక్కన ఏళ్ల క్రితం నాటిన పెద్ద పెద్ద చెట్లను నిర్మాణంలో భాగంగా తొలగించారు. కూకటివేళ్లతో సహా పెకిలించి మరో చోట నాటడానికి ఆధునిక పద్ధతులు అందుబాటులో ఉన్నా అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోలేదు. రామాయంపేట మండల పరిధిలోని అటవీప్రాంతంలో నాలుగున్నర కిలోమీటర్లు తప్పించి, ఇతర చోట్ల చెట్ల తొలగింపు ప్రక్రియ దాదాపు పూర్తి అయింది. అనుమతులు వస్తే అటవీ ప్రాంతంలో చెట్లను కూడా పూర్తిస్థాయిలో తొలగించి పనులు ప్రారంభిస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మెదక్, రామాయంపేట, సిద్దిపేట మధ్య రోడ్డు పక్కన చెట్లను నరికివేయగా, రహదారి బోసిపోయింది. అటవీలో పరుచుకున్న పచ్చదనం సైతం త్వరలో కనుమరుగు కానుందని పర్యావరణ ప్రేమికులు తల్లడిల్లుతున్నారు.



త్వరలో కనుమరుగు కానున్న అటవీ ప్రాంతంలో పచ్చదనం

'బడిబాట'కు సన్నద్ధం



ముందస్తు బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- జూన్ 6 నుంచి 19 వరకు నిర్వహణ
- కార్యాచరణ రూపొందించిన విద్యాశాఖ
- జిల్లాలో 876 పాఠశాలలు, 61,533 విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు కొనసాగనున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కోసం విద్యాశాఖ సన్నద్ధం అవుతుంది. పండగ వాతావరణంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రైవేట్, బడిబయట పిల్లలే లక్ష్యంగా నమోదు కార్యక్రమం చేపట్టనుంది. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా.. తల్లిదండ్రులను ఆకట్టుకునేలా చదువుల పండగ కొనసాగనుంది. ఇప్పటికే అన్ని పాఠశాలలను ఆధునీకరించే దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. డిజిటల్ బోధనలకు అనుకూలంగా క్లాస్ రూంలు తీర్చిదిద్దుతున్నారు. జిల్లాలో 876 ప్రభుత్వ పాఠశాలలుండగా, 61,533 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా కొన్ని గ్రామాల్లో టీచర్లు ముందస్తు బడిబాట ప్రారంభించారు.

ప్రభుత్వ బడుల బలోపేతం

ప్రభుత్వ బడిని బతికించుకునే దిశగా విద్యాశాఖ భగీరథ ప్రయత్నం చేస్తుంది. ఇప్పటికే పభుత్వ బడులను పరిపూర్ణ వికాస కేంద్రాలుగా తీర్చిదిద్దుతోంది. ప్రైవేట్‌కు ధీటుగా డిజిటల్ క్లాసులు ప్రారంభించింది. 50 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధ, ఏఎక్స్ఎల్ ల్యాబ్‌లు ఆరంభించింది. డిజిటల్ పాఠాల కోసం ఇప్పటికే 176 పాఠశాలల్లో బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బాండ్ సర్వీసుల సౌకర్యం కల్పించగా, మరో 300 పాఠశాలల కోసం ప్రతిపాదనలు పంపారు. ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్) బోర్డులతో బోధన కొనసాగిస్తున్నారు. ఈఏడాది ఖాన్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో సైన్స్, గణితం పాఠాలు బోధించడానికి చర్యలు తీసుకుంటున్నారు. అన్ని బడులకు కలర్లు వేశారు. ప్రతి పాఠశాలకు ఫర్నీచర్, గ్రీన్ బోర్డులు పంపిణీ చేశారు. కనీస సామర్థ్యాల సాధన దిశగా ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో శిక్షణ ఇచ్చారు.

కార్యక్రమాలు ఇలా..

- జూన్ 6న స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయడం.
- 7న టీచర్లు ప్రతి ఇంటికి వెళ్లి బడీడు పిల్లలను గుర్తించడం.
- 8, 9, 10 తేదీల్లో కరపత్రాల పంపిణీ, డ్రాపౌట్ పిల్లల గుర్తింపు.
- 11న అప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష.
- 12న పాఠ్య, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ
- 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలసభ నిర్వహణ
- 16న తరగతి గదుల్లో అభ్యసన సామర్థ్యాలకు సంబంధించిన పోస్టర్లు వేసి, పిల్లలు తయారు చేసిన చార్టులు ప్రదర్శించాలి. ఎఫ్ఎల్ఎన్ క్విజ్ పోటీలు పెట్టాలి.
- 17న సమీకృత విద్య, బాలికా విద్యా దినోత్సవం నిర్వహణ
- 18న తల్లిదండ్రులకు తరగతి గదుల డిజిటలీకరణ, ఆధునిక సౌకర్యాలు చూపాలి
- 19న బడిబాట ముగింపు, విద్యార్థులకు క్రీడా పోటీల నిర్వహణ

సర్కారు బడికి పంపండి



రూ. వేలు పోసి చదువులు కొంటారా..! ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటారా !! తల్లిదండ్రులు నిర్ణయించుకోవాలి. సర్కార్ బడికి పంపండి మీ పిల్లల భవిష్యత్, బాధ్యత మాది. ఆధునిక పద్ధతుల్లో డిజిటల్ విద్యను, ఏఐ టెక్నాలజీతో జోడించి, విలువలు గల చదువులు నేర్పి, బంగారు భవిష్యత్‌ను ఇస్తాం. స్థాయికి తగిన సామర్థ్యాలను నేర్పుతాం. 1 నుంచి 10 వరకు ఇంగ్లీష్ మీడియం అందుబాటులో ఉంది. క్వాలిఫైడ్ టీచర్లతో ఉత్తమ బోధన అందిస్తాం.

– రాధాకిషన్, డీఈఓ

మెరుగైన వైద్యం అందించండి

కలెక్టర్ రాహుల్‌రాజ్



వైద్య సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్

మనోహరాబాద్(తూప్రాన్): ఆస్పత్రికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోజువారీగా ఓపీ ఎలా ఉంటుందని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట వైద్యులు వినోద, సూపర్‌వైజర్ పల్లవి, ఫార్మసిస్ట్ సురేష్‌కుమార్, ఏఎన్ఎం మాధవి, శ్రవణ్ ఉన్నారు.

రైతులను మోసం చేస్తే చర్యలు

ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంగా పని చేసి రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా జరగకుండా చూడాలన్నారు. ఆరుగాలం కష్టపడే రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారులపై ఉందన్నారు. రైతులకు నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముందస్తుగా రైతులతో సమావేశాలు నిర్వహించి చైతన్య పర్చాలన్నారు. గతంలో నకిలీ విత్తనాల కేసుల్లో సంబంధం ఉన్నవారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండి నాణ్యమైన కంపెనీ విత్తనాలు ఎంచుకోవాలన్నారు. లేబుళ్లు, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాల గురించి, అనుమానిత బ్రోకర్లు, డీలర్ల గురించి పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పచ్చిరొట్టతో నాణ్యమైన దిగుబడి

- అందుబాటులో జనుము, జీలుగ విత్తనాలు
- జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి వినయ్



మెదక్ కలెక్టరేట్: పచ్చిరొట్ట ఎరువులు వాడటంతో భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు వస్తాయని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి వినయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం జిల్లాలో 15,000 క్వింటాళ్ల జనుము, 30,000 క్వింటాళ్ల జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వరి నాట్లు ఎక్కడైతే ముందు జరుగుతాయో ఆ మండలాల్లో ప్రాథమిక సహకార సంఘాలు, రైతు ఆగ్రోస్ కేంద్రాల వద్ద పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మిగితా మండలాలకు నాలుగు రోజుల్లో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నేలకు, పంటకు మేలు చేసే పచ్చిరొట్ట ఎరువును తయారు చేసేందుకు ప్రభుత్వం జీలుగ విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేస్తుందన్నారు. పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు ఉన్న రైతుకు మాత్రం 50 శాతం వరకు సబ్సిడీపై అందుతుందన్నారు. రైతులు రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి, సేంద్రియ పద్ధతిలో భూసారం పెంచే దిశగా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

నిబంధనల పట్టింపు ఏది?

ఉపాధి పనులపై కేంద్రం బృందం నిలదీత



ఈజీఎస్ పనులను తనిఖీ చేస్తున్న అధికారులు

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై నిబంధనల పట్టింపులేకుండా వ్యవహరించడమేమిటని కేంద్ర తనిఖీ బృందం పంచాయతీ రాజ్ శాఖ అధికారులను నిలదీశారు. దీంతో సంబంధిత అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లనమిలారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్వహించిన పనులను తనిఖీ చేసేందుకు ఆదివారం రాయికోడ్‌కు గ్రామీణాభివృద్ధి శాఖ జాతీయ అధికారులు సంజయ్‌కుమార్ తదితరులు వచ్చారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో నిర్మించిన టాయిలెట్స్, వంట గది, ప్రహరీలను, పలు మెటల్, ఫార్మేషన్ రోడ్లను పరిశీలించారు. ఎక్కడా నిబంధనలు పాటించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బృందం పర్యటిస్తుంటే రాష్ట్ర, జిల్లా అధికారులు పీఆర్‌డీఈ తదితరులు హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈజీఎస్ నిధుల వినియోగంలో కనీస నిబంధనలు పాటించకపోవడంపై వివరాలు నమోదు చేసుకున్నారు. నివేదికను తమ శాఖకు నివేదించనున్నట్లు తెలిపారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ

మెదక్ కలెక్టరేట్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నా గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం లేదని ఆరోపించారు. చాలీచాలని వేతనాలతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని మండిపడ్డారు. 4, 5 నెలలకు ఒకసారి వేతనాలు చెల్లిస్తే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి, కోశాధికారి నర్సమ్మ, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కేతకీలో కోటి జపయజ్ఞం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): శ్రీ కేతకీ సంగమేశ్వరాలయంలో ఆలయ ఆవరణలో విశ్వ మానవ ధర్మ ప్రచారం పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం శివ మంత్ర కోటి జపయజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఆవరణలో 'దేశ రక్షణ–ధర్మ శిక్షణ'సంకల్పంతో యజ్ఞం, పూర్ణాహుతి, మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దత్తగిరి మహరాజ్ ఆశ్రమ పీఠాధిపతి గిరి మహారాజ్, ధనసిరి పీఠాధిపతి వీరేశ్వర శివాచార్య మహాస్వామి, రంజోల్ రాజయోగ ఆశ్రమ పీఠాధిపతి రాజయ్య స్వామి, కేతకీ ఆలయ పాలకమండలి చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, ఆలయ ఈఓ శివ రుద్రప్ప, మాజీ చైర్మన్ నీల వెంకటేశం, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

అమ్మను దర్శించి.. మొక్కులు చెల్లించి

పాపన్నపేట(మెదక్): తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన ఏడుపాయల ఆలయం ఆదివారం వేలాది భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు శంకర శర్మ, పార్థివశర్మ దుర్గమ్మ తల్లిని ఎరుపు రంగు పట్టు వస్త్రాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

మల్లన్న క్షేత్రం.. భక్తజన సంద్రం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం భక్తజన సంద్రంగా మారింది. ఆదివారం భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. స్వామివారిని దర్శించుకున్న అనంతరం గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ ఎస్పీ అన్నపూర్ణ.. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాటేజీల నిర్మాణానికి మంచిర్యాలకు చెందిన దాతలు మహేందర్, రవీందర్‌లు రూ.15లక్షలు చెక్కురూపంలో ఈఓ అన్నపూర్ణకు అందించారు.

– కొమురవెల్లి(సిద్దిపేట)



గంగిరేణి చెట్టు ప్రాంగణంలో భక్తుల సందడి



స్వామి వారి నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు



విశేషాలంకరణలో లక్ష్మీనారసింహులు



నాచగిరీశుని దర్శించుకుంటున్న భక్తులు

నాచగిరి.. భక్తఝరి

కిటకిటలాడిన పుణ్యక్షేత్రం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి లక్ష్మీసమేత స్వామివారిని దర్శించుకుని తరించారు. మరోవైపు వర్గల్ సరస్వతి క్షేత్రం భక్తులతో సందడిగా మారింది. భక్తులు కొండపైన సరస్వతి అమ్మవారిని, లక్ష్మీగణపతి, శనీశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర, చంద్రమౌళీశ్వర, వెంకటేశ్వరాలయాలలో దేవతామూర్తులను దర్శించుకున్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్



మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని జాలపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం రెవెన్యూ సిబ్బంది పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం తహసీల్దార్ మధుసూదన్ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనవారు నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్‌కు విద్యార్థి ఎంపిక



విద్యార్థి షణ్ముఖను సన్మానించి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కపూర్‌నాయక్ తండా గ్రామానికి చెందిన భానోతు మంగ- రాజు దంపతుల కుమార్తె షణ్ముఖ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్‌కు ఎంపికైంది. ఆమె నంగునూర్ మండలంలోని గట్లమల్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ నెల 2,3,4వ తేదీల్లో జగిత్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో మంచి ప్రతిభ కనబరిచింది. దీంతో 27వ తేదీన చండీఘర్‌లో జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో ఆడనుంది. ఓ మారుమూల గిరిజన తండాకు చెందిన షణ్ముఖ జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల తండావాసులు, కాంగ్రెస్ నాయకులు అజ్మీర అనిల్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే గట్లమల్యాల ఉన్నత పాఠశాల 1999–2000 సంవత్సరం బ్యాచ్ పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి ఆమెకు రూ.6వేల ఆర్థిక సాయం అందజేసి సన్మానించారు.

వ్యక్తి అదృశ్యం



లక్ష్మణ్

చేగుంట(తూప్రాన్): బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం... జెత్రం తండాకు చెందిన జాటోత్ లక్ష్మణ్ తన భార్య లక్ష్మీతో కలిసి ఈనెల 20న శివ్వంపేట మండలం తులపల్లి తండాకు బంధువుల ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తూప్రాన్ నుంచి బస్సులో ఇంటికి వస్తుండగా మాసాయిపేట బస్సు స్టేషన్‌లో లక్ష్మణ్ బస్సు దిగి ఎంతకు రాలేదు. దీంతో భర్త ఆచూకీ కోసం భార్య వెతికినా ఫలితం కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పోతాన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం... పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన అరికెల బూదయ్య(57) జీఎంఆర్ హైవేస్ ఆధీనంలో ఉన్న జాతీయ రహదారిపై కూలీపనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 15న జీఎంఆర్ హైవేస్ పెట్రోలింగ్ వాహనం రామంతాపూర్ శివారులో చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వామి, బూదయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. బూదయ్యకు ఆర్వీఎం ఆస్పత్రిలో చికిత్స చేయించి శుక్రవారం ఇంటికి తీసుకొచ్చారు. శనివారం రాత్రి బూదయ్య మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పోచారం.. 'వన విజ్ఞానం'

- అడవులు, జంతువుల గురించి అవగాహన
- విజ్ఞాన కేంద్రంలో యానిమల్స్ బొమ్మల ప్రదర్శన
- విద్యార్థులకు ఫీడ్‌బ్యాక్ వాల్ స్క్రీన్ ద్వారా చైతన్యం



విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన జంతువుల బొమ్మలు



హవేళీఘణాపూర్(మెదక్): అడవులు అంతరించిపోకుండా మొక్కలు పెంచి అడవుల శాతం పెంచాలని చెబుతున్న అధికారులు భవిష్యత్ తరాల విద్యార్థులకు ఉపయోగపడేలా వన విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ విజ్ఞాన కేంద్రంలో అడవిలో ఉండే జంతువులు దుప్పి, సింహం, ఎలుగుబంటి, జింకలు తదితర జంతువుల బొమ్మలను ప్రదర్శనకు ఉంచారు. మెదక్‌కు 14కిలోమీటర్ల దూరంలో ఉన్న హవేళీఘణాపూర్ మండలం పోచారం అభయారణ్యం పక్కనే ఈ వన విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల క్రితం యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ఎస్ఐడీ) ఆధ్వర్యంలో రూ.56లక్షల వ్యయంతో 2021లో నిర్మించారు. ఈ కేంద్రం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇక్కడికి వచ్చిన ఒక్కో విద్యార్థి సందర్శించేందుకు రూ.10 చెల్లిస్తే విజ్ఞాన కేంద్రంను చూపిస్తారు. అందులో ఒక హాల్‌లో టీవీని ఉంచి జంతువుల బొమ్మలు, వాటి ఆహారం , ఏయే రకాల జంతువులు ఉంటాయి. దాన్ని పరిరక్షించేందుకు మన బాధ్యతేమిటి? వన సంరక్షణ వల్ల కలిగే లాభాల గురించి టీవీల్లో చూపించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు.

అటవీ సంపదపై అవగాహన

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను జూ పార్కులకు తీసుకెళ్లి చూపిస్తుంటారు. కానీ వాటి ఆహారం.. అవి ఏయే ప్రాంతాల్లో ఉంటాయి.. రకరకాల జంతువులు, పక్షులు, వేసవిలో వచ్చే పక్షుల గురించి కూడా ఈ ఫీడ్‌బ్యాక్ సెంటర్‌లో స్క్రీన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. వేసవిలో తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకెళ్లి వన విజ్ఞాన కేంద్రంను సందర్శించవచ్చు.

యూఎస్ఎస్ఐడీ బృందం సందర్శన



పోచారం వన విజ్ఞాన కేంద్రం

అడవుల వల్ల కలిగే ప్రయోజనాలు అనేకం ఉంటాయి. కానీ ఈతరం వారికి తెలిసినవి కొన్ని మాత్రమే ఉంటాయి. యూఎస్ఎస్ఐడీ బృందం పోచారం అభయారణ్యం సందర్శనకు వచ్చిన సమయంలో అడవుల్లో ఉండే గిరిజనులకు సహజంగా లభించే ఉపాధి, ఇతర ఉపయోగాల గురించి అడిగి తెలుసుకున్నారు.

భవిష్యత్ తరాలకు ఉపయోగం



ఈతరం విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యానికి ఆయుష్షునిచ్చే అడవి సంపద గురించి తెలుపడం ముఖ్య ఉద్దేశం. అడవుల్లో ఉండే జంతువులు, పక్షుల గురించి వన విజ్ఞాన కేంద్రంలో వివరిస్తాం. వాటిని సంరక్షించడం ద్వారా ఎలాంటి ఉపయోగాలుంటాయి.. ఏయే పక్షులు ఎలా అడవుల్లో జీవనం సాగిస్తాయనే దానిపై విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పిస్తాం.

- మనోజ్‌కుమార్, ఎఫ్ఆర్ఓ

సీనియర్ మేట్ల సమస్యలు పరిష్కరించండి



జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

గ్రామీణ ఉపాధి హామీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మెదక్ కలెక్టరేట్: సీనియర్ మేట్ల సేవలను గుర్తించి ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో నియమించాలని గ్రామీణ ఉపాధి హామీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో సీనియర్ మేట్ల జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల్లో నియమించి, ప్రత్యేక అలవెన్స్ కింద నెలకు రూ.10వేలు వేతనం చెల్లించాలన్నారు. జిల్లాలో అమలవుతున్న ఉపాధి హామీని గ్రామాల్లో విజయవంతంగా అమలు చేసే దానిలో సీనియర్ మేట్ల పాత్ర కీలకమైందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ కంటే సీనియర్ మేట్లు అనేక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇన్ని పనులు చేస్తున్నా వారికి ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందడం లేదన్నారు. ఎండీఓ ఆఫీసులో ప్రత్యేక మీటింగ్‌లుంటే సొంత చార్జీలతో వెళ్లి వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాన్ని నమ్ముకొని చాలామంది సీనియర్ మేట్లు హరితహారం మొక్కలను సంరక్షించే పనిని ఉచితంగా చేస్తున్నారని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో కలిసిన గ్రామాలన్నింటికీ ప్రత్యేక ఉపాధి పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే.మల్లేశంతో పాటు సీనియర్ మేట్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆటోలు ఢీ..

పలువురికి స్వల్ప గాయాలు

అల్లాదుర్గం(మెదక్): రెండు ఆటోలు ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన అల్లాదుర్గం మండలం చిల్వెర గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చిల్వెర గ్రామ ఐబీ చౌరస్తా నుంచి బోడ్మట్‌పల్లి వైపు వస్తున్న ఆటోను మరో ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలుడితో పాటు మరో నలుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. గాయపడ్డ క్షతగాత్రులను అంబులెన్సులో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.



ప్రమాదంలో గాయపడ్డ బాలుడు

నకిలీ విత్తనాలపై నజర్

విత్తన ఎంపికే కీలకం

- రైతులు నకిలీ విత్తనాలు కొనొద్దు..
- ఆఫర్లు చూసి మోసపోవద్దు
- ఎరువులు, విత్తన విక్రయాలపై నిఘా
- ఏఈఓల ద్వారా గ్రామాల్లో అవగాహన
- అన్నదాతలకు వ్యవసాయ అధికారుల సూచనలు



విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

దుబ్బాకటౌన్/చిన్నకోడూరు(సిద్దిపేట): రైతన్నలు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఆరుగాలం శ్రమకు ఫలితం దక్కాలంటే రైతన్న వేసే పంట విషయంలో విత్తనాల ఎంపికే కీలకం. దుక్కి దున్నింది మొదలుకొని పంట చేతికొచ్చే వరకు ప్రతీ చోట జాగ్రత్తలు పాటిస్తేనే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచిస్తున్నారు.

జిల్లాలో నకిలీ విత్తన విక్రయాలపై అధికారులు నిఘా పెంచారు. ప్రతీ గ్రామంలో విత్తన కొనుగోలు కేంద్రాల్లో అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం సైతం నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించింది. అయిన రైతుల అమాయకత్వాన్ని కొంతమంది సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు విత్తనాలు, ఎరువుల విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

ఎరువుల విషయంలో జాగ్రత్తలు

పంటల అధిక దిగుబడికి ఎరువులు ఎంతో మేలు చేస్తాయి. కానీ కొందరు దళారులు, వ్యాపారులు నాసిరకం ఎరువులు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారు. ఫలితంగా అమాయక రైతులు నష్టపోతున్నారు. ఈ మేరకు కొన్ని మెలకువలు పాటిస్తే నకిలీ ఎరువులను నివారించే అవకాశం ఉంది. ఎరువులను కూడా లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలి.బిల్లు తప్పనిసరి. డీలర్ బుక్‌లో రైతులు తప్పకుండా సంతకం చేయాలి.



హబ్సీపూర్‌లో నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

విత్తనాలు కొనుగోలు చేసే ముందు సూచనలు

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బస్తాలపై పేరు, గడువు తేదీ వివరాలు తప్పకుండా గమనించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రశీదు తప్పకుండా తీసుకోవాలి.
- రశీదుపై విత్తన రకం, గడువు తేదీ పేర్కొనేలా డీలర్ సంతకం తీసుకోవాలి. రైతు సంతకం కూడా ఉండేలా చూసుకోవాలి.
- విత్తనాలను కొనుగోలు చేసే ముందు వ్యవసాయ శాఖ అధికారి, శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవడం మంచిది.
- మార్కెట్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ధ్రువీకరించిన విత్తనాలు విక్రయిస్తారు. వీటిని కొనుగోలు చేసే సమయంలో బస్తాపై నీలి వర్ణం ట్యాగ్ ఉందో లేదో గమనించాలి.
- లేబుల్ విత్తనాలు కూడా మార్కెట్లో లభ్యమవుతున్నాయి. జిల్లాలో ఈ రకం విత్తనాలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. వీటిని కొనుగోలు చేసే ముందు విత్తన సంచిపై ఆకుపచ్చ ట్యాగ్ కట్టి ఉంటుంది. దీనిపై విత్తన ప్రమాణాలు ముద్రించి విక్రయిస్తారు. ఈ విత్తనాలను రైతులు కేవలం ఆయా కంపెనీ నమ్మకంపై మాత్రమే కొనుగోలు చేయాలి.
- బ్రీడర్ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తన సంచికి పసుపు రంగు ట్యాగ్ ఉందో లేదో గమనించాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



చిన్నకోడూరులో విత్తనాల దుకాణాలు తనిఖీ చేస్తున్న పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు

రోహిణి కార్తె ప్రారంభమవడంతో రైతులు విత్తనాల కోసం దుకాణాలకు వెళ్తున్నారు. పలు విత్తన కంపెనీలు డీలర్లకు ఆఫర్లు ప్రకటిస్తాయి. ఆ ఆఫర్లతో డీలర్లు సైతం రైతులకు విత్తనాలను అంటగట్టే అవకాశం ఉంది. వారి మాటలు నమ్మి మోసపోవద్దు. ఫొటోలు, ఆఫర్లు చూపి కంపెనీలు రైతులను పట్టణాలకు తీసుకుపోవడం, గ్రామాల్లో తిరుగుతూ విత్తన ప్యాకెట్లను బుక్ చేసుకోవడం చేస్తుంటారు. వాటికి దూరంగా ఉండటం రైతులకు మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



జిల్లాలో ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారి లైసెన్స్‌ను రద్దు చేస్తాం. ఎక్కడైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే రైతులు వెంటనే దగ్గరలో ఉన్న వ్యవసాయాధికారికి సమాచారం అందించాలి. విత్తన ఎంపిక, నకిలీ విత్తనాల విషయంలో ఏఈఓల ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకబోతున్నాయి. జూన్‌లో పంటలు వేస్తే మంచిది.

- మల్లయ్య, జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు, ఏడీఏ, దుబ్బాక

అవగాహన అవసరం

విత్తనాలపై రైతులకు అవగాహన ఉండాలి. కొనుగోలు చేసిన ప్యాకెట్లలో ఉన్న విత్తనాలు ఎంత శాతం మొలకెత్తుతాయో చూసుకోవాలి. రశీదు, ప్యాకెట్లను భద్రపర్చుకోవాలి. అనుమతి ఉన్న డీలర్ల దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి.

- జయంత్ కుమార్, ఏఓ, చిన్నకోడూరు

అబ్దుల్ ఖాదర్‌ను విడుదల చేయండి

- హైకమిషన్ ఆఫ్ ఇండియాకు ఎంపీ రఘునందన్‌రావు వినతి
- 4 నెలలుగా మలేషియా జైలులోనే పోతారెడ్డిపేట వాసి



హై కమిషన్ ఆఫ్ ఇండియా కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక: బతుకుదెరువు కోసం మలేషియా వెళ్లి తప్పుడు కేసులో అరెస్టు అయి జైలులో ఉన్న దుబ్బాక నియోజకవర్గంలోని భూంపల్లి–అక్బర్‌పేట మండలం పోతారెడ్డిపేటకు చెందిన అబ్దుల్‌ఖాదర్‌ను విడుదల చేయించాలని ఆదివారం కౌలాలంపూర్‌లోని హై కమిషన్ ఆఫ్ ఇండియాకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. ఉపాధి కోసం 7 సంవత్సరాల క్రితం మలేషియాకు వెళ్లిన అబ్దుల్‌ఖాదర్ అక్కడ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం కంపెనీలో కొంత మంది వ్యక్తులతో గొడవ జరిగింది. దీంతో వ్యక్తిగత విభేదాల వల్ల ఆ కంపెనీ వారు అతడిపై తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేయించడంతో నాలుగు నెలలుగా జైలులో ఉన్నాడు. ఈ విషయాన్ని రెండు రోజుల క్రితం మలేషియా పర్యటనకు వెళ్లిన ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి అక్కడి తెలుగువాళ్లతో పాటు బాధిత కుటుంబీకులు తీసుకువచ్చారు. వెంటనే కౌలాలంపూర్‌లో ఉన్న హై కమిషన్ ఆఫ్ ఇండియాలో హై కమిషనర్ బీఎస్ రెడ్డిని కలిసి జరిగిన విషయంపై విన్నవించారు. తప్పుడు కేసులో అరెస్టు అయి జైలులో ఉన్న అబ్దుల్ ఖాదర్‌ను విడుదల చేయించి, స్వదేశానికి పంపించాలని ఎంపీ కోరడంతో పాటు వినతిపత్రం అందజేశారు.

మా తండ్రిని విడుదల చేసి ఇండియాకు పంపించండి: బాధితుడి కుమారులు

కాగా బతుకు దెరువు కోసం మలేషియాకు వెళ్లిన తమ తండ్రిని అరెస్టు చేయడం పట్ల పోతారెడ్డిపేటలోని అబ్దుల్ ఖాదర్ భార్యతో పాటు ముగ్గురు కుమారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ తండ్రిని విడుదల చేసి ఇండియాకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని బాధితుడి కుమారులు సల్మాన్, సోహైల్ భారత ప్రభుత్వాన్ని కోరారు.

రావమ్మా.. మహాలక్ష్మి



చిన్నారికి స్వాగతం పలుకుతున్న కుటుంబీకులు, బంధువులు

నర్సాపూర్: ఆ ఇంట్లో ఆడపిల్ల పుట్టడంతో కుటుంబ సభ్యులు సంబురపడ్డారు. చిన్నారితో సహా తల్లి తమ ఇంటికి రాగానే పూలు చల్లుతూ స్వాగతం పలికారు. వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన కరుణాకర్, స్పందన దంపతులకు 27 రోజుల కింద ఆడశిశువు జన్మించింది. ఇటీవల చిన్నారికి అమ్మమ్మ గారింట్లో తొట్టెల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆదివారం కరుణాకర్ నర్సాపూర్‌లోని తమ ఇంటికి తీసుకొని వచ్చాడు. కుటుంబ సభ్యులు తమ ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని సంతోషం వ్యక్తం చేస్తూ పూలు చల్లుతూ స్వాగతం పలికి సంబురాలు చేసుకున్నారు.

స్విమ్మింగ్‌లో సిద్దిపేట స్విమ్మర్స్ ప్రతిభ



పోటీల్లో స్విమ్మింగ్ చేస్తున్న క్రీడాకారులు



శ్రీహర్ష, భారతికి బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్ర స్థాయి 10వ స్విమ్మింగ్ ఛాంపియన్ 2025లో సిద్దిపేట స్విమ్మర్స్ ప్రతిభ కనబర్చారు. ఆదివారం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన పోటీల్లో సిద్దిపేట క్రీడాకారులు శ్రీహర్ష ప్రియా, భారతి ప్రతిభ చూపారు. 50 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో శ్రీహర్ష, 50మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగంలో భారతి మూడవ స్థానంలో నిలిచారు. వీరికి రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం

విద్యుత్ వైర్లకు తాకుతున్నాయని చెట్ల నరికివేత



విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల నరికివేత

శివ్వంపేట(నర్సాపూర్): హరితహారంలో భాగంగా గతంలో నాటిన మొక్కలు గొడ్డలి పెట్టుకు గురవుతున్నాయి. మండల కేంద్రంలోని తూప్రాన్- నర్సాపూర్ హైవే పక్కన విద్యుత్ లైన్ కింద మొక్కలు నాటడం వల్ల ప్రస్తుతం అవి ఏపుగా పెరగడంతో తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. కొమ్మలు వైర్లకు తగులుతుండటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని సిబ్బంది వాటిని తొలగిస్తున్నారు. వైర్లను చూడకుండా మొక్కలు నాటడంతో ప్రయోజనం లేకుండా పోయిందని ప్రకృతి ప్రేమికులు పేర్కొంటున్నారు.

వర్షానికి కూలిన ఇంటి పైకప్పు



దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటలో శనివారం కురిసిన వర్షానికి జనగామ స్వామి ఇంటి పైకప్పు, గోడలు అర్ధరాత్రి సమయంలో కూలడంతో భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.